ప్రజాశక్తి

ఆదివారం 23 ఫిబ్రవరి 2025

5

అల్లూరి సీతారామరాజు



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్వెల్ డే వేడుకను శనివారం ఘనంగా విద్యార్థులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని, విద్యార్థులు వివిధ సంస్కృతిక కార్యక్రమాలతో పాటు గిరిజన సంప్రదాయమైన దింసా నృత్యాలను ప్రదర్శిస్తూ ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థుల ఆటపాటలతో కళాశాల ఆవరణం పండగ వాతావరణం కనిపించింది.



సందడి చేస్తున్న విద్యార్థులు

రైల్వే డబుల్ లైన్ పనులతో ధ్వంసమైన..

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

- ఆదివాసీ గిరిజన సంఘం ఆందోళన



నినాదాలు చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు, గిరిజనులు

ప్రజాశక్తి-అరకులోయ: అరకువేలి మండలం బొండం పంచాయతీ గన్నెల జంక్షన్ నుండి కరకవలస రైల్వే స్టేషన్ వరకు రెండో లైన్ రైల్వే పనుల కోసం ఆర్ ఎస్ సర్ తుంబాత్, టి ఎన్ టి కంపెనీల పెద్ద పెద్ద వెహికల్స్, కంటైనర్స్ రోడ్డుపై రాక పోకలు సాగించడంతో ధ్వంసమైన రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, మండల కార్యదర్శి జి.బుజ్జిబాబు మాట్లాడుతూ, రైల్వే రెండో లైన్ పనుల నిమిత్తం గన్నెల జంక్షన్ నుండి కరకవలస రైల్వే స్టేషన్ వరకు రోడ్డు ధ్వంసమైందని సంబంధిత రైల్వే కన్స్ట్రక్షన్ డిపార్ట్మెంట్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. రైల్వే అధికారుల నుండి సంబందిత కన్స్ట్రక్షన్ కంపెనీల నుండి ఎటువంటి స్పందన లేక పోవడంతో శనివారం పనులు నిలిపి ఆందోళన చేసామన్నారు. ఈ రోడ్డు చుట్టుపక్కల గ్రామస్తులకు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్ళాన్నా, అనారోగ్యం పాలైన వారిని హాస్పిటల్‌కు చేర్పించాలన్నా ప్రధాన రోడ్డు మార్గం రైల్వే రెండో లైన్ పనులతో గన్నెల జంక్షన్ నుండి కరకవలస మధ్యలో సుమారు 650 మీటర్స్ వరకు రోడ్డు మరమ్మత్తులకు గురవడం తో చుట్టూ ప్రక్కల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రమాదం అని తెలిసినా ప్రాణాల్ని గుప్పల్లో పెట్టి ప్రయాణాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైన అధికారులు, కంపెనీ యజమానులు స్పందించి రోడ్డు మరమ్మత్తుల చేయాలని, లేని పక్షంలో భవిష్యత్ లో గ్రామస్థులు అందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కె రామారావు,కె బుజ్జి బాబు, టి జోషి,రేగా పెసా అధ్యక్ష కార్యదర్శి లు జి.డొంబు, కె అప్పన్న, కొత్త వలస పెసా ఉపాధ్యక్షులు జి సత్యారావు, వార్డ్ మెంబెర్ జి.రామస్వామి, గ్రామస్తులు పి.ప్రసాద్ జి.రాజు పి.రాజు, టీడీపీ నాయకులు కె.దయానిది, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల గొంతు విజయగౌరి

-పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి - మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి-చింతపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే విజయగౌరి గెలిపించాలన్నారు. ఇప్పటికే గిరిజన ప్రాంతంలో జీవో 3 రద్దు కావడంతో గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లేక వలస పోతున్నారన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు గెలుపొందితే చట్టసభల్లో జీవో 3 పునరుద్ధరణకు కృషి చేస్తారన్నారు. గిరిజన ప్రాంతంలోని ఖనిజ సంపదను కాపాడుకునేందుకు చట్టసభల్లో పోరాటం చేస్తామన్నారు. 1/70 చట్టం పరిరక్షణ కోసం గిరిజనులకు నిరంతరం అండగా ఉంటారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తుందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రద్దు చేసిన ప్రభుత్వ పాఠశాలలతో విద్యార్థులు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి విద్యను అభ్యసించవలసిన దుస్థితి నెలకొందన్నారు. గిరిజన భూములకు రక్షణ లేకుండా చూడడమే కాకుండా, రహదారులకు ఇరువైపులా సుమారు 5 కిలోమీటర్ల మేర భూములను అక్రమంగా లాక్కుంటున్నారన్నారు. గిరిజన చట్టాలను సవరించే అధికారం ఈ ప్రభుత్వాలకు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. భూ బదలింపు చట్టాన్ని సవరిస్తే మన్య ప్రాంతంలో మరో అల్లూరి సీతారామరాజు పోరాటం చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీలక్ష్మి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కే త్రిమూర్తులు రెడ్డి, ఉపాధ్యాయులు ప్రసాద్, కృష్ణ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ



కటిక నేలపై చదువుతున్న విద్యార్థులు

మట్టి నేలపైనే చిన్నారుల చదువులు

-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి అనంతగిరి: పాఠశాలలు మెరుగు పరిచి నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా ఆచరణలో అమలు కాలేదు. మండలంలోని దబ్బలపాడు పాఠశాల భవనం పూర్తిగా మరమ్మత్తు గురి కావడంతో మట్టిలోనే కూర్చుని చదువుకోవలసిన దుస్థితి నెలకొంది.

చిలకలగెడ్డ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ధబ్బలపాడు ప్రైమరీ పాఠశాల లో 29 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల భవనం పురాతనమైంది కావడంతో కనీసం సిమెంటు గచ్చు లేకపోవడంతో మట్టి నేలపైనే విద్యార్థులు చదువుతున్నారు.గత ప్రభుత్వం నాడు నేడు పేరుతో అనేక పాఠశాలల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేశారు. కానీ మండలంలో కొన్ని పాఠశాలలు అసలు కనీస సౌకర్యాలు కూడా కనిపించకపోవడం విచారకరం. అందులో భాగంగా దబ్బులపాడు గ్రామంలో ఉన్న పాఠశాలలో చిన్నారులు మట్టిలో కూర్చొని ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు వినాల్సి వస్తుంది.

ఈ విషయంపై ఉపాధ్యాయుని వివరణ కోరగా నాడు నేడు లో ఈ పాఠశాల ఎంపిక కాలేదని అందువల్ల నిధులు మంజూరు కాలేదని తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్‌కు తెలియపరిచానని అన్నారు. మండలంలో ఇటువంటి పాఠశాలలో అనేకం దర్శనమిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు పాఠశాలలో మరమ్మతులు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని తల్లిదండ్రులు కోరుతున్నాం

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గుంటసీమ రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టిక్కిలి బెడ్డ వీధిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు. వీధి దీపాలు లేక రాత్రుల్లో చిమ్మ చీకటిగా ఉంటుండడంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించడానికి పలు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వీధిదీపాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మత్స్యగుండం జాతరకు ప్రత్యేక బస్‌లు

ప్రజాశక్తి-పాడేరు: మహాశివరాత్రి సందర్భంగా ప్రసిద్ధ శివ క్షేత్రమైన మత్స్యగుండం జాతరకు 30 ప్రత్యేక బస్ సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు పాడేరు ఆర్టీసీ జిల్లా పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ అధికారి టి ఉమామహేశ్వర్ రెడ్డి శనివారం విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26, 27 తేదీలలో రెండు రోజులపాటు భక్తులు, సందర్శకుల సౌకర్యార్థం ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నామన్నారు.పాడేరు అరకు జోలాపుట్ చింతపల్లి ప్రాంతాల నుంచి ఈ బస్సు సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

కల్యాణోత్సవాలకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి -కొత్తకోట: మహాశివరాత్రి సందర్భంగా కల్యాణపులోవలో ఈనెల 26 నుంచి 28 వరకు నిర్వహించే పోతురాజు బాబు తిరునాళ్ళు కు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అనకాపల్లి డి.ఎస్.పి శ్రావణి ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆమె కళ్యాణపులోవను సందర్శించారు. పోతురాజు బాబు ఆలయం, పెద్దింటి అమ్మ తల్లి, పుణ్య స్థానాలు ఆచరించే జలాశయాన్ని పరిశీలించారు. జాతరకు భక్తులు ఎంతమంది వస్తారు, ఎక్కడ నుంచి ఎక్కడ వరకు ట్రాఫిక్ ఉంటుందో కొత్తకోట సీఐ కోటేశ్వరావును అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూ లల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని, దొండపూడి చెక్ పోస్ట్ నుంచి ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మూడు రోజులపాటు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, వాహనాలు భక్తులు వెళ్లేందుంకు ట్రాఫిక్ కి ఇబ్బందులు లేకుండా చూడాలని, స్టాఫర్ లు ఏర్పాటు చేయాలని, జలాశ యం లో స్నానాలు చేసే వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా గజ ఈతగాళ్ళను అందుబాటులో ఉంచాలని,హెచ్చరిక బోర్డులు బారికేడ్లు ఏర్పాటు చేయాలని సీఐ కోటేశ్వరరావు కు సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆశాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి

డిసిఎంపై చర్యలు తీసుకోవాలి

- 4న పిహెచ్‌సిల వద్ద ధర్నాలు
- 6న చలో విజయవాడ
-ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మట్ల వాణిశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మట్ల వాణిశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా ఆశా వర్కర్లను రిటైర్‌మెంట్ చేయిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ జిల్లా డిసిఎం మనోజ్ కుమార్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, సిఐటియు ఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన ఆశా వర్కర్ల జిల్లా సమావేశంలో వాణిశ్రీ మాట్లాడుతూ రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతం కాకినాడ జిల్లాలో ఉన్నప్పుడే 2019లో గిరిజనుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాంతంలో ఎవరికీ రిటైర్‌మెంట్ చేయకుండా నాటి రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ప్రవీణ్ ఆదిత్య ఆధ్వర్యాన తమ యూనియన్‌తో చర్చలు జరిపి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అప్పటి నుంచి ఏజెన్సీలో ఆశా వర్కర్ల రిటైర్‌మెంట్ విషయంలో యూనియన్‌తో మాట్లాడి నిర్ణయం చేస్తున్నారని తెలిపారు. కాని నేడు అల్లూరి జిల్లా డిసిఎం మనోజ్ కుమార్ మాత్రం దానికి భిన్నంగా రంపచోడవరం సబ్ కలెక్టర్ ఆదేశించినప్పటికీ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండానే రిటైర్‌మెంట్ ఇస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, జిల్లా వైద్య ఆర్యోగశాఖ అధికారి వెంటనే స్పందించి జిల్లా డిసిఎంపై చర్యలు తీసుకోవాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇచ్చే వరకు రిటైర్‌మెంట్స్ ఆపాలని డిమాండ్ చేశారు. 30 ఏళ్లుగా ఎన్నో కష్టాలను ఓర్చుకొని, రూ.400 గౌరవ వేతనంతో ఎనలేని సేవలు అందించిన గిరిజన ప్రాంత ఆశవర్కర్లపై ఏమాత్రం జాలి లేకుండా డిసిఎం రిటైర్‌మెంట్‌కు పిహెచ్‌సి అధికారులకు ఆదేశాలు జారీ చేయటం సరికాదన్నారు. డిసిఎం ఎందుకు అంత చొరవ చూపిస్తున్నారో పైఅధికారులు ఆలోచన చేయాలని కోరారు. ఈ సమస్యల పరిస్కారానికై మార్చి 4న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ధర్నాలు, 6న చలో విజయవాడ కార్యక్రమాలు నిర్వహిస్తునట్టు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కలింకోట రమణమ్మ, కొమరం చెల్లయమ్మ, కుంజం, రాధమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు

సిహెచ్‌సి సూపరింటెండెంట్ మహేష్‌బాబు

ప్రజాశక్తి-కూనవరం

కూనవరం మండలం కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉన్న ఎన్ఆర్‌సి కేంద్రంలో పౌష్టికాహార లోపం, బరువు తక్కువతో ఉన్న పిల్లలు, రక్తహీనతతో బాధపడే పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు, ప్రతి రోజూ మంచి పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.మహేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల పరిధిలో ఉన్న గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలలో పని చేస్తున్న కార్యకర్తలు, ఆయాలు స్థానికంగా ఇలాంటి లోపంతో ఉన్న వారిని గుర్తించి కోతులగుట్ట ఎన్ఆర్‌సి కేంద్రానికి పంపించాలని కోరారు. ఇలాంటి లోపాలతో ఉన్న పిల్లలకు వైద్య సేవలు అందించడంతో పాటు వారి తల్లిదండ్రులకు భోజన వసతి, ప్రతి రోజు వంద రూపాయలు ఇన్సెంటివ్ కూడా అందజేయడం జరుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ సేవలు పొందాలని సూపరింటెండెంట్ కోరారు.



విఆర్.పురంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని విఆర్.పురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రమణ ఆధ్వర్యాన శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. విఆర్.పురం సంతపాకల నుండి ఇందిరాగాంధీ సెంటర్ వరకు, అక్కడ నుండి అంబేద్కర్ కాలనీ వరకు మురికి కాలువ చెత్తా చెదారంతో నిండిపోయి దుర్వాసన రావడం, అస్తవ్యస్తంగా చెత్తాచెదారం దర్శనమివ్వడం, పిచ్చి మొక్కలు తొలగించకపోవడం, దోమల వృద్ధితో స్థానికులకు నిద్ర లేకపోవడం, రోగాలబారిన పడటం వంటి సమస్యలపై ఈ నెల 20న గురువారం ప్రజాశక్తి దినపత్రిక కథనం ప్రచురించిన విషయం విధితమే. దీనికి స్పందించిన అధికారులు శనివారం పంచాయతీ కార్మికులతో8 యుద్ధ ప్రాతిపదికన కాలువలను శుభ్రం చేయించారు. చెత్త కుప్పలను, పిచ్చి మొక్కలను తొలగించారు. దీనిపై గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



తుప్పలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

చిత్రలేఖనంలో జెడ్‌పి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

గుంటూరులో ఇటీవల నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్, ఇద్దరు సిల్వర్ మెడల్స్ కైవసం చేసుకోగా, మరో 23 మంది ప్రశంస పత్రాలు అందుకున్నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం గోపాలకృష్ణ శనివారం విలేకరులకు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం గోపాల్కృష్ణ, పియంసి కమిటీ చైర్మన్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. మంచి తర్ఫీదు ఇచ్చిన డ్రాయింగ్ ఉపాధ్యాయులు కొండబాబును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



మెడల్స్, ప్రశంసా పత్రాలు చూపుతున్న విద్యార్థులు

గురువులు గుణపాఠం చెప్పాలి..!

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

నిరుద్యోగులు, ఉపాధ్యాయుల తరపున మండలిలో మాట్లాడతానని నమ్మబలికి, ఇప్పుడు గ్రూపు-2 అభ్యర్థుల రోస్టర్ విధానంపై ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మౌనందాల్చారు. పదవి కోసం పట్టభద్రులను వంచించారు. మాట నమ్మి గెలిపించి మోసపోయామని ఇప్పుడు పట్టభద్రులు బాధపడుతున్నారు. రోస్టర్‌ను సవరించే వరకూ గ్రూపు-2 మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాలని అభ్యర్థులు వీధుల్లోకి వచ్చారు. అభ్యర్థుల అభ్యర్థనను పట్టించుకోని చిరంజీవిరావు రాజీనామా చేయాలంటూ వారంతా పెద్ద ఎత్తున విశాఖ కేంద్రంగా మూడు రోజులపాటు నిరసన తెలిపారు. తనకీ గౌరవం తెచ్చిపెట్టిన పట్టభద్రుల్లో భాగమైన గ్రూపు-2 అభ్యర్థులకు కనీస ధైర్యం, భరోసాను ఆయన ఇవ్వలేకపోయారు. ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి న్యాయం చేస్తానని చెప్పలేకపోయారు. పాలకపక్ష పక్షపాతికి పదవికి కట్టబెడితే ప్రయోజనం కంటే నష్టం ఎక్కువగా వుంటుందని చెప్పడానికి ఇదొక ఉదాహరణ. ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా పనిచేసే వ్యక్తులను కాకుండా ప్రజల మేలుకోరి పనిచేసే పోరాట నేపథ్యం కలిగిన శ్రేయోభిలాషులను ఎన్నుకోవడమే సముచితం. తమ కోసం పనిచేసే వారెవరు ? ఇచ్చిన అవకాశాన్ని సొంతానికి ఉపయోగించుకొనేదెవరు ? గెలిపించిన జనం కోసం పనిచేసేదెవరు ? పనిచేస్తున్నదెవరు ? ఆలోచించేదెవరు ? మాట్లాడేదెవరు ? అని తెలుసుకొని తీర్పు ఇవ్వాల్సిన సమయం ఉపాధ్యాయ, అధ్యాపకులకు అసన్నమైంది.

ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోటీలో ఉన్న పది మందిలో అత్యంత విలక్షణమైన నేపథ్యం, పోరాట



అనుభవం పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న కోరెడ్ల విజయగౌరికి వుంది. విద్యార్థి దశలో ప్రారంభమైన ఆమె ధిక్కార స్వరం, ఉపాధ్యాయ ఉద్యమంలో మరింత రాటుదేలింది. విద్యారంగంపై ప్రభుత్వాలు ఎక్కుపెట్టిన దాడులను తిప్పికొట్టడానికి పాఠశాలలకు వెళ్లి ఉద్యమాలకు పదునుబెట్టిన పట్టుదల కలిగిన మహిళామె. తాను చదువుచెప్పిన విద్యార్థులకు కష్టమొస్తే ఆదుకొనే విశాల హృదయం ఆమెది. టిడిపి మద్దతునిస్తున్న సిట్టింగ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ తన పదవీకాలంలో ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడిందిలేదు. ప్రమాదకర విద్యావిధానాలపై నిలదీసిందీలేదు. ఆయన ఇకపై మాట్లాడుతారన్న ఆశ ఎంత మాత్రమూ లేదు. రెండు దఫాలుగా ఎన్నికైన గాదె శ్రీనువాసులు నాయుడు ఆయన కాలంలోని ప్రభుత్వానికి భజన చేయడానికి, సొంత పనులు చేసుకోవడానికి ఆ పదవిని వినియోగించుకున్నారన్న విమర్శలు ఉండనే ఉన్నాయి. రాష్ట్రంలో విద్యారంగ పరిరక్షణ, ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపైనే కాదు, ప్రయివేటు ఉపాధ్యాయులకు ఆరోగ్య, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, ప్రత్యేక చట్టం చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మండలిలో అడిగారు. ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఏనాడూ ఈ ప్రాంత ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై మాట్లాడిన సందర్భంలేదు. 'ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, అధ్యాపకుల బాధలపై శాసన మండలిలో మాట్లాడే గొంతు ఒకటుండాలి. ఆ గొంతు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అయి ఉండాలి' అన్న వాతావరణం ఉత్తరాంధ్రలో తాజాగా కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర నుంచి తమ తరపున మాట్లాడే మనిషి మండలిలో ఒకరున్నారని ప్రతి ఉపాధ్యాయుడు, అధ్యాపకుడూ గర్వంగా చెప్పుకోవాలంటే విజయగౌరి గెలవాలి. అధికార అండతో, ప్రలోభాలతో గెలవాలనుకొనే అల్పబుద్ధులకు స్థానమివ్వబోమని ఈ ఎన్నికలతో గురువులు తేల్చిచెప్పాలి.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇన్‌ఛార్జి పిఒ అభిషేక్ గౌడ్

25 నుంచి మత్స్యగుండం శివరాత్రి జాతర

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ మత్స్యగుండం మత్స్య లింగేశ్వర స్వామి జాతరను ఈ నెల 25,26,27 తేదీల్లోని జరుగుతుందని పాడేరు ఐటిడిఎ ఇంచార్జి ప్రాజెక్ట్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం. జె అభిషేక్ గౌడ్ తెలిపారు. శనివారం ఐటిడిఎ కార్యాలయం వద్ద మత్స్యగుండం ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి గోడ ప్రతికలను ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతర లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మత్స్య గుండం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు.

ఉత్సవ కమిటీ వైస్ పర్సన్ మఠం శాంత కుమారి మాట్లాడుతూ, 25,26 తేదీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, భజన, శివ పార్వతుల కళ్యాణం వైభవం గా నిర్వహిస్తున్నామని తెలిపారు. 26న అల్లూరి ఆదివాసీ వికలాంగుల సంక్షేమ పరిరక్షణ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్న సంతర్పన, 27న మోద మాంబ తాలీ మెడ్సిన వెల్ఫేర్ సొసైటి సహకారంతో భారీ అన్నదాన దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో ఉత్సవ కమిటీ అధ్యక్షులు మినుముల గోపాల పాత్రుడు, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్య కొండబాబు, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు వంతల ఈశ్వర్, ప్రోటోకాల్ ఇంచార్జి మఠం సింపచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర కళలపై
గీతం విద్యార్థుల అధ్యయనం

ప్రజాశక్తి -మధురవాడ : ప్రకృతి సిద్ధమైన ఉత్పత్తులను ఉపయోగిస్తూ సంప్రదాయ పద్ధతిలో బొమ్మల తయారీతో ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన ఏటికొప్పాక కళాకారులను, ఖద్దరు తయారీలో పేరుగాంచిన పొందూరు నేతకారులను, తీరప్రాంతం వాతావరణాన్ని తట్టుకు నిలిచే గృహనిర్మాణంలో ఆరితేరిన మత్స్యకారులను స్వయంగా కలసి వారి సంప్రదాయ కళారూపాల గొప్పదనాన్ని తెలుసుకోవడానికి వీలుగా ఉత్తరాంధ్ర అధ్యయన యాత్రను గీతం నిర్వహించింది. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ తొలి సంవత్సరం విద్యార్థులు, అసోసియేట్ ప్రొఫెసర్ రవీంద్ర పాట్నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ హేమ గుడ్ల, అతిథి అధ్యాపకులు జస్వంత్, జ్యోతి మిత్రా మార్గదర్శకత్వంలో ఉత్తరాంధ్ర లోని పలు స్వదేశీ గ్రామాలు, శిల్ప కళను పరిశీలించారు. బేసిక్ డిజైన్, విజువల్ ఆర్ట్స్‌లో భాగంగా నిర్వహించిన ఈ అధ్యయనం, వృత్తిపరమైన స్థలాల నిర్మాణ విధానాలను, ఆయా గ్రామాలలోని జీవన శైలి అనుగుణంగా అవి ఎలా రూపుదిద్దుకుంటాయో అర్థం చేసుకోవడమే లక్ష్యంగా సాగింది. ఈ క్రమంలో నర్సీపట్నం రోడ్డుకు సమీపంలోని ఏటికొప్పాక గ్రామాన్ని సందర్శించిన విద్యార్థులు, అక్కడి ప్రఖ్యాత చెక్కబొమ్మల తయారీ ప్రక్రియను పరిశీలించారు. ప్రకృతి రంగులతో, సేంద్రీయ పదార్థాలతో తయారయ్యే ఈ కళాకృతులు స్థానిక శిల్పుల సంప్రదాయ జ్ఞానాన్ని పరిశీలించారు.

జాజువనిపాలెం గ్రామాన్ని సందర్శించి, కుండల తయారీ ప్రక్రియను అధ్యయనం చేశారు. శ్రీకాకుళం జిల్లా బుడితి, పొందూరు గ్రామాలను పరిశీలించారు. బుడితిలో శిల్పులు లోహ శిల్పాలను రూపొందించే విధానాన్ని నేర్చుకోగా, పొందూరులో ఖాదీ నూలు వృత్తి ప్రాముఖ్యతను పరిశీలించారు. చేపలుప్పాడ, కాపులుప్పాడ సమీపంలోని కళాగ్రామాన్ని సందర్శించారు. మత్స్యకారుల జీవన విధానాన్ని పరిశీలించారు. సముద్ర తీర ప్రాంత జీవన సౌకర్యాలు, వాస్తు నిర్మాణాలను గమనించారు. ఈ అధ్యయనం ద్వారా విద్యార్థులు స్వదేశీ సంప్రదాయాలకు దగ్గరయ్యే అవకాశం పొందారని, భవిష్యత్తులో శిల్ప సంపదను పరిరక్షించే బాధ్యతాయుతమైన వాస్తుశిల్పులుగా విద్యార్థులు ఎదగడానికి వారిలో అవగాహనను పెంచిందని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ విభూతి సచ్చదేవ్ పేర్కొన్నారు.

చెత్త సేకరణకు ప్రత్యేక డ్రైవ్

జిల్లా పంచాయతీ అధికారి లవరాజు



చెత్త సేకరణ చేపడుతున్న లవరాజు

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశముల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా 42,525 గ్రామ పంచాయతీలలో ఇంటింటి చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించినట్లు జిల్లా పంచాయతీ అధికారి లవ రాజు తెలిపారు. పాడేరు పంచాయతీ నీలకంఠ నగర్ ప్రాంతంలో, అదేవిధంగా హుకుంపేట మండలం జీకే మండ గ్రామంలో ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ చేపట్టామన్నారు. ఇంటింటి చెత్త సేకరణలో మండల అభివృద్ధి అధికారి, పంచాయతీ సిబ్బంది, సర్పంచ్, క్లాఫ్ మిత్రలు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. 935 కేజీల పొడి చెత్త, 753 కేజీల తడి చెత్తతో పాటు 5952 ప్లాస్టిక్ బాటిల్స్, 912 కేజీల ప్లాస్టిక్ సేకరించడం జరిగిందని వివరించారు. ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్తలు వేరువేరుగా సేకరించడం జరిగిందని, ప్రజలందరూ అందుకు సహకరించారని డిపిఓ అభినందించారు. అదేవిధంగా ఆదివారం కూడా జిల్లా వ్యాప్తంగా చెత్త సేకరించడం జరుగుతుందని, అందుకు ప్రజలు సహకరించాలని డిపిఓ కోరారు.

స్కౌట్స్‌తో విద్యార్థులకు క్రమశిక్షణ : డిఇఒ బ్రహ్మాజీ



బాడెన్ పావెల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిఇఒ బ్రహ్మాజీ

ప్రజాశక్తి-పాడేరు, : స్కౌట్ శిక్షణతో విద్యార్థులలో క్రమశిక్షణ, సేవా భావం పెంపొందుతుందని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మజి అన్నారు. స్కౌట్ ఉద్యమ పితామహుడు బాడెన్-పావెల్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో (తలారిసింగి పాడేరు) శనివారం నిర్వహించిన "వరల్డ్ థింకింగ్ డే" (ప్రపంచ ఆలోచనా దినోత్సవం) వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్కౌట్ అధికారులతో కలిసి బాడెన్-పావెల్ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఏ దేశంలోని ప్రజలు మంచి ఆలోచనలతో మెలుగుతారో ఆ దేశ భవిష్యత్తు బంగారుమయం అవుతుందన్నారు. 'మన ప్రపంచం- మన భవిష్యత్తు' అనే నినాదంతో 2025 వరల్డ్ థింకింగ్ డే ని జరుపుకుంటు న్నామన్నారు. ప్రజలకు మంచి ఆలోచనల ప్రాముఖ్యతను తెలియజేయడానికి, పర్యావరణం, విద్య, లింగ సమానత్వం లాంటి సామాజిక అంశాలపై చర్చించేందుకు ఇటువంటి సమావేశాలు ఉపయోగపడతాయన్నారు. యువతకు అధికారాలు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అందుకే స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం ప్రపంచ సోదర భావాన్ని, ఐక్యతకు గల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు చెప్పడం జరుగుతుందన్నారు. స్కౌటింగ్‌తో శారీరక, మానసిక ఉల్లాసం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి బాక లవకుశ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమిత్ర, వ్యాయామ ఉపాధ్యాయులు, సింహాచలం, జి.మన్మదరావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక సహకారానికి ఎంఒయు



ఎంఒయులో మార్చుకుంటున్న ప్రతినిధులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎపిఇపిడిసిఎల్ అమలు చేస్తున్న పథకాలకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని తీసుకొనేందుకు స్వానిటీ ఇనీషియేటివ్‌తో ఒప్పందం కుదుర్చుకొంది. సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇమ్మడి సమక్షంలో సంస్థ ఎనర్జీ కన్సర్వేషన్ విభాగం సిజిఎం జె.శ్రీనివాసరావు సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో స్వానిటీ ఇనీషియేటివ్ సంస్థ ట్రస్టీ ఉమ బట్టాచార్య ఎంఒయుపై సంతకాలు చేశారు. ఎపిఇపిడిసిఎల్‌లో అమలు చేస్తున్న పిఎం సూర్యఘర్, పిఎం కుసుమ్, ఫీడర్ స్థాయిలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్లు, డిస్ట్రిబ్యూటెడ్ బ్యాటరీ స్టోరేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని ఉచితంగా అందించేందుకు అమెరికాకు చెందిన స్వానిటీ ఇనీషియేటివ్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ సంస్థ ఓపెన్ యాక్సెస్ విధానం వల్ల ఇపిడిసిఎల్ ఆదాయంపై కలిగే ఆర్థిక ప్రభావాన్ని అధ్యయనం చేయడం, సంస్థ ఆర్థిక నష్టాలను తగ్గించడం, వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించడమే కాకుండా విద్యుత్ ప్రమాదాల నివారణ, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించనుంది.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి
- భార్యకు గాయాలు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని గిడిజాల వైఎస్ఆర్ కాలనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతిచెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆనందపురం మండలం పొడుగుపాలెం గ్రామానికి చెందిన బంటుపల్లి లక్ష్మణరావు (36) భార్య గౌరీవరలక్ష్మి వేమగొట్టిపాలెంలో మృతిచెందిన బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆనందపురం వస్తుండగా విజయనగరం నుంచి సింహాచలం వైపు వస్తున్న కారు గిడిజాల వైఎస్ఆర్.కాలనీ సమీపంలో వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. లక్ష్మణరావు కారు అద్దంపైకి తుళ్లి పడిపోయారు. భార్య గౌరీవరలక్ష్మి రోడ్డుపై పడడంతో ఆమె రెండు కాళ్లపై నుంచి కారు చక్రాలు వెళ్లిపోయాయి. ఆమెకు కాళ్లు, చేతులు విరిగిపోయాయి. వారిద్దరినీ విశాఖపట్నం పినాకిల్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో లక్ష్మణరావు మృతిచెందారు. గౌరీ వరలక్ష్మి తీవ్ర గాయాలతో విషమ పరిస్థితిలో ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. డ్రైవర్ మద్యం తాగి, అతివేగంగా కారును నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెం గ్రామానికి చెందిన ఉపాధి కూలి గువ్వల నారాయణమ్మ (64) శనివారం చెరువులో మట్టి పనులు చేస్తూ అకస్మాత్తుగా కుప్పకూలింది. వాంతులు చేసుకుని ఒక్కసారిగా కుప్పకూలడంతో తోటి కూలీల సాయంతో ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్ పల్లా మురళి తగరపువలసలోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌కు తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఫీల్డ్ అసిస్టెంట్ మురళి తెలిపారు. దాకమర్రి పంచాయతీ ముద్దాడపేటలోని బాపన చెరువులో జరుగుతున్న మట్టి పనుల్లో నారాయణమ్మ పనిచేసినట్లు ఎంఎన్ఆర్ఇజిఎస్ మండల ఇన్‌ఛార్జి అడిషనల్ ప్రోగ్రాం అధికారి గౌరి తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎండిఒ ఎన్.హనుమంతరావు పరిశీలించారు. మృతి చెందిన నారాయణమ్మ కుటుంబానికి తగిన పరిహారం చెల్లించాలని సిఐటియు జోన్ నాయకులు రవ్వ నరసింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాలువలో బాలుని మృతదేహం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కంచరపాలెం దరి రామ్మూర్తి పంతులు పేట జివిఎంసి హైస్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న బెంగాలీ తరుణ్ (9) జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌కు ఆనుకొని ఉన్న కెనాల్‌లో శనివారం విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందడంతో కంచరపాలెం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి నీటిలో తేలియాడుతున్న బాలుని మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఈ విషయమై కంచరపాలెం పోలీసులు మీడియాతో మాట్లాడుతూ తరుణ్ శుక్రవారం స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లి అప్పటి నుంచి ఇంటికి రాలేదని తల్లి పల్లవి తమకు ఫిర్యాదు చేసిందని తెలిపారు. బాలుని మృతిపై దర్యాప్తు జరుపుతామని చెప్పారు.

ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇఇసిఇ విభాగం ఆధ్వర్యాన 'వీఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్ యూజింగ్ ఓపెన్ సోర్సు టూల్స్' అనే అంశంపై రెండు వారాల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి) శనివారం ముగిసింది. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజి మంత్రిత్వ శాఖ సహకారంతో ఐఐటి గౌహతి, ఐఐటి జబల్‌పూర్, ఐఐటి రూర్కెలా, ఎన్ఐటి పాట్నాలతో కలసి గీతం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ పాల్గొని అధ్యాపకులు నూతన అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఇఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.భరణీచంద్రకుమార్ మాట్లాడుతూ, అధ్యాపకుల పరిశోధనలకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటి గౌహతి ప్రొఫెసర్ త్రివేది, గీతం డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి, కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ఆర్.ఫణికుమార్, డాక్టర్ చుక్కా రాజశేఖర్, ల్యాబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కన్నయ్య స్తూపం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

కన్నయ్య ఆశయాలను కొనసాగిస్తాం

ప్రజాశక్తి - అల్లూరి జిల్లా : ప్రజలు, గిరిజన సమస్యలపై రానున్న కాలంలో రాజీలేని పోరాటాలు నిర్వహించడం ద్వారా చదలవాడ పంచాయతీ మాజీ సర్పంచ్, సిపిఎం నాయకులు కామ్రేడ్ కట్టం కన్నయ్య ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం నేతలు పేర్కొన్నారు. చింతూరు మండలం తులసిపాక గ్రామంలో ఏర్పాటు చేసిన కట్నం కన్నయ్య స్థూపాన్ని శనివారం సిపిఎం సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. కన్నయ్య చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. సిపిఎం పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు మడకం చిన్నయ్య ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్, సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తులసిపాక ప్రాంతంలో గిరిజనులపై ఫారెస్ట్ దాడులకు వ్యతిరేకంగా అమరవీరులు బత్తుల భీష్మారావు, పులి రామయ్య సారథ్యంలో వీరోచిత పోరాటాలు నిర్వహించినట్లు చెప్పారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ప్రజల్ని ఐక్యం చేసి అనేక పోరాటాలు చేసిన నేత కట్టం కన్నయ్య అని పేర్కొన్నారు. చదలవాడ పంచాయతీ సర్పంచ్‌గా ఐదు సార్లు ఎన్నికైన కన్నయ్య గ్రామాల్లో మంచినీరు, రోడ్లు, కరెంటు, పాఠశాలలు, ఆశ్రమ స్కూళ్లు వంటి సౌకర్యాలు కల్పనకు విశేష కృషి చేశారని కొనియాడారు. ఎక్కడ గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లితే అక్కడ కన్నయ్య ఎర్ర జెండా పట్టుకొని ఉండేవారని తెలిపారు. నేటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కులను, చట్టాలను తుంగలో తొక్కుతూ పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు ఏజెన్సీ ప్రాంత సంపదను దోచిపెట్టే విధానాలను అవలంభిస్తున్న నేపథ్యంలో వాటికి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం విఆర్.పురం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, నాయకులు పోడియం రామారావు, చింతా రాంబాబు, మడకం రమేష్, కలుముల మల్లేష్, పట్రా రమేష్, బివి రమణ, ఆసు గణేష్, కూర సత్యనారాయణ, కూర గంగరాజు, పూసం వీరయ్య, బాడిశ శేషు, తెల్లం చిన్నయ్య, దారయ్య, సత్తిబాబు, రామారావు, కన్నయ్య కుటుంబ సభ్యులు రామకృష్ణ, రాములమ్మ, రమేష్, వెంకటలక్ష్మి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రంప ఉత్సవాలకు రూ.6 లక్షలు

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని రంప గ్రామాల్లో జరిగే శివరాత్రి ఉత్సవాలకు రూ.6లక్షల చెక్కును రంప సిబిఇటి సభ్యులకు రంపచోడవరం డిఎఫ్ఒ రవీంద్ర ధామ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబిఇటి ద్వారా వచ్చే నగదు నుండి ఈ ఉత్సవాలకు నిధులు ఇచ్చినట్లు చెప్పారు. అయితే తాము ముందస్తుగా ఖర్చులకు సంబంధించిన కొటేషన్లు సమర్పించమని అడిగామని, గ్రామస్తులు ఇవ్వడానికి నిరాకరించడంతో ఆలస్యం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, రంప గ్రామస్తులు పాల్గొన్నారు.

మిలియన్ మొక్కలు నాటడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్వచ్ఛతా క్యాంపెయిన్ 4.0, స్వచ్ఛతాహీ సేవా 2024లో భాగంగా ఏక్ పేడ్ మాకే నామ్ పేరుతో మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను విశాఖపట్నం పోర్టు ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో పలుచోట్ల నిర్వహించిందని పోర్ట్ కార్యదర్శి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో స్థానికులను భాగస్వాములుగా చేస్తూ పోర్టు ఈ కార్యక్రమాలను చేపట్టిందని వచ్చే మూడేళ్లలో మిలియన్ మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో భాగస్వాములు కావాలని పోర్టు యాజమాన్యం జిల్లా యంత్రాంగాన్ని కోరుతూ విశాఖ జిల్లా కలెక్టర్‌కు జనవరి 22న లేఖ రాయగా ఆయన స్పందించారన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి డివి రాఘవులు గెలుపు ఖాయం


మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డివి రాఘవులు గెలుపు ఖాయమని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. టిడిపి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటమి భయం పట్టుకుందని పేర్కొన్నారు. రాజవొమ్మంగి ప్రజా సంఘాల కార్యాలయంలో సిపిఎం నాయకులు రామరాజు అధ్యక్షతన శనివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో సీతారాం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. టిడిపి కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను దగా చేశారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేవన్నారు. మహిళలకు ఉచిత బస్సు హామీని ఎందుకు అమలు చేయలేదో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయనివారికి ఈ ఎన్నికలో ఎందుకు ఓట్లు వేయాలో, ఎందుకు గెలిపించాలో కూటమి నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన్న కిరణ్, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మండల కార్యదర్శి కొండ్ల సూరిబాబు, నాయకులు శ్రీను, జగన్నాథదంధొర, ఎస్ అచ్చారావు, పాండవుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


విఆర్.పురం మండలంలో ప్రచారం చేపడుతున్న ప్రజా సంఘాల నాయకులు

విఆర్.పురం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని రాజపేట పంచాయతీ పరిధి సీతంపేట, రాజుపేట గ్రామాల్లో శనివారం ప్రజా సంఘాల నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 40 సంవత్సరాల ఉపాధ్యాయ అనుభవం కలిగిన రాఘవులు ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన ఉన్నారని తెలిపారు. అందుకే ఏ ఉపాధ్యాయుడిని అడిగినా తమ కుటుంబ సభ్యుల ఓట్లన్నీ పిడిఎఫ్ అభ్యర్థికే వేస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గుండుపూడి లక్ష్మణరావు, శ్రీరామగిరి శాఖ సెక్రటరీ ఆత్మకూరు కాంతారావు, వార్డు సభ్యులు రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై వామపక్షాల నిరసన

ప్రజాశక్తి - అనకాపల్లి : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ శనివారం నెహ్రూ చౌక్ జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు అండగా నిలిచిన ఉపాధి హామీ చట్టంలో రూ.60 వేల కోట్లు మేర బడ్జెట్‌లో కోత విధించారని, పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చే విద్య, వైద్య రంగాల్లోనూ, వ్యవసాయ రంగానికీ తగిన కేటాయింపులు లేవని అన్నారు. కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీలకు ప్రయోజనం కలిగే విధంగా బడ్జెట్‌లో అనేక రాయితీలు కల్పించారని విమర్శించారు. వికసిత్ భారత్ కోసం రూపొందించిన బడ్జెట్‌గా దీన్ని మోడీ ప్రభుత్వం వర్ణించడం పచ్చి మోసమని, ఈ బడ్జెట్ చీకటి భారత్‌ను నిర్మించేదని విమర్శించారు. ఇటీవల అమెరికా వెళ్లిన ప్రధాని మోడీ భారతదేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టి అమెరికాతో రూ.5 లక్షల కోట్ల మేర చమురు ఉత్పత్తులు, యుద్ధ విమానాల ఒప్పందాలు చేసుకున్నారని విమర్శించారు. జిఎస్‌టి, విద్యుత్ ఛార్జీల భారాలు వేసే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. ఈ బడ్జెట్ గొప్పగా ఉందని రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం చెప్పడం కేంద్రానికి దాసోహం అవ్వడమే అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీలు అమలుకు ఎటువంటి కేటాయింపులూ చేయని ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి ఎలా దోహదపడుతుందని ప్రశ్నించారు. తమ అధికార ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టి మోడీ ప్రభుత్వానికి భజన చేయడం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. బడ్జెట్‌లో పేదరిక నిర్మూలనకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. కార్పొరేట్ కంపెనీలు బ్యాంకులకు ఉన్న రూ.10 వేల కోట్ల అప్పులను మాఫీ చేశారని, తిరిగి బ్యాంకులు వారికి అప్పులు ఇచ్చే విధంగా కేంద్రం చర్యలు తీసుకుందని దుయ్యబట్టారు. నిత్యావసర ధరలతో పాటు అన్నింటి ధరలూ పెరిగాయన్నారు. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, దీనికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలను ఉధృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యన్నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, అల్లు రాజు, నాయకులు బి.ఉమామహేశ్వరరావు, జి.సుభాషిణి, సిపిఐ జిల్లా నాయకులు ఆర్.దొరబాబు, సన్యాసిరావు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఇసుకతోట వద్ద రోడ్డుపై బైఠాయించిన గ్రూప్ 2 అభ్యర్థులు

రోస్టర్‌పై రోడ్డెక్కారు
- విశాఖలో గ్రూపు 2 అభ్యర్థుల నిరసనల హోరు
- ఇసుకతోట వద్ద జాతీయ రహదారిపై బైఠాయింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోస్టర్ పాయింట్స్‌ను సవరించి గ్రూప్ 2 పరీక్షలను యధావిధిగా కొనసాగించాలని విశాఖలో అభ్యర్థులు తలపెట్టిన నిరసన శనివారానికి మూడో రోజుకు చేరింది. ఉదయం ఎంవిపి.కాలనీలోని ఆర్‌సి రెడ్డి స్టడీ సెంటర్ వద్ద ఆందోళన చేపట్టిన వారంతా సాయంత్రానికి పోరాటాన్ని ఉధృతం చేశారు. ఇసుకతోట వద్ద జాతీయ రహదారిపైకి పెద్ద సంఖ్యలో తరలివచ్చి బైఠాయించారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ వారి ఆందోళన కొనసాగింది. తమ ఆందోళనను పట్టించుకోకుండా గ్రూప్ 2 పరీక్ష నిర్వహణకు ఎపిపిఎస్‌సి సిద్ధమవుతుండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ తీరుపై పెద్దపెట్టున నినదించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని పేర్కొంటూ సిఎం డౌన్ డౌన్ అని నినదిస్తూ జాతీయ రహదారిపైనే పడుకున్నారు. పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించినా అభ్యర్థులెవ్వరూ బెదిరిపోకుండా పట్టుదలతో ఆందోళనను కొనసాగించారు. రోడ్డుపై పడుకున్న ఆందోళనకారులను పోలీసులు పక్కకు ఈడ్చుకెళ్తే అంతకు రెట్టింపు మంది వచ్చి అక్కడే బైఠాయించడం వారి పోరాట ఉధృతికి నిదర్శనంగా కనిపించింది. పరీక్ష రాయకపోయినా, అరెస్టులు అయినా జీవితాలు పోతాయన్న ప్రభుత్వ, పోలీసు బెదిరింపులేవీ అక్కడ పనిచేయలేదు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. తమ ఆందోళనను ఆదివారమూ కొనసాగిస్తామని, అందులో భాగంగా పరీక్షా కేంద్రాల వద్ద ధర్నాలు చేపడతామని అభ్యర్థులు తెలిపారు. జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

'ఉక్కు' నిర్వీర్యానికి కుట్రలు తీవ్రం

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోడీ సర్కారు కుట్రలను తీవ్రతరం చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1472వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేసే క్రమంలోనే కేంద్రం విఆర్ఎస్ సర్క్యులర్‌ను ముందుకు తెచ్చిందన్నారు. ఉక్కు కర్మాగారంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించి కార్పొరేట్ శక్తులకు ప్లాంట్‌ను కట్టబెట్టేందుకు కుటిలయత్నాలు సాగుతున్నాయన్నారు. కార్మికులకు, ఉద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. తీరు మార్చుకోకుంటే అందరినీ ఐక్యం చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో నాయకులు ఎ.మసేన్‌రావు, జె.రామకృష్ణ, తాండ్ర కనకరాజు, శివరామకృష్ణ, జి.జయ, సోంబాబు, తుమ్మల శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని దూసరపాము పంచాయితీలో శనివారం వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చీడి శివ మాట్లాడుతూ పంచాయతీలోని సుబ్బంపాడు, ఎర్రంపాడు, దూసరపాము గ్రామాలలో ప్రజల సౌకర్యార్థం యుద్ధ ప్రాతిపదికన వీధిలైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయతీలో ఏ గ్రామంలోనూ విద్యుత్ సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కలవపల్లి రాంబాబు, మంతిని ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.